# ఉక్కుకు ముమ్ముందు భలే గిరాకీ

**● విస్తరణలు, సంయుక్త సంస్థల దూకుడు ధోరణి**

**● మౌలిక ప్రాజెక్టులు పెద్ద ఊతం**

☛ 'ఈనాడు'తో పెబ్స్ ఈడీ పి.వి.రావు

ఈనాడు - హైదరాబాద్

భారత దేశంలో ఉక్కు వినియోగానికి గిరాకీ ప్రస్తుతం ఏటా 8 శాతానికి పైగా పెరుగుతోంది. రానున్న అయిదేళ్లలో ఇది పది శాతానికి పైబడవచ్చని భావిస్తున్నారు. అదే జరిగినా ప్రపంచ వినియోగ స్థాయితో పోల్చుకొంటే భారత్ ఇంకా ఎంతో వెనుకబడే ఉంటుందని చెప్పుకోవాలి. మన తలసరి ఉక్కు వినియోగం 55 కిలోలు ఉండగా, ఈ అంశంలో ప్రపంచ సగటు 215 కిలోలు ఉంది. దీనిని బట్టి చూస్తే, భారత్‌లో ఉక్కు వినియోగం అధికం కావడానికి మరెంతో అవకాశం ఉన్నట్లు అర్థమవుతుంది. దీనికి తగ్గట్టు భారత ఉక్కు రంగం సామర్థ్య విస్తరణకు నడుం కట్టవలసిన అవసరం ఉంది.

భారత్‌లో ఉక్కుకు క్రమంగా పెరుగుతున్న గిరాకీ, పరిశ్రమ పురోగతికి అడ్డు నిలుస్తున్న అంశాలు, పరిశ్రమ భావి రూపు రేఖలు తదితర అంశాలపై పెన్నార్ ఇంజినీర్డ్ బిల్డింగ్ సిస్టమ్స్ కార్యనిర్వాహక సంచాలకుడు (ఈడీ) పి.వి.రావుతో 'ఈనాడు' మాట్లాడింది. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం పన్నెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో లక్ష కోట్ల డాలర్ల పెట్టుబడులను లక్ష్యంగా నిర్దేశించిన నేపథ్యంలో సమీప భవిష్యత్తులో ఉక్కు రంగానికి గిరాకీ పెరిగే వీలుందని ఆయన చెబుతున్నారు. ముఖాముఖిలో ఇతర అంశాలు:

**కొన్ని అవరోధాలు:** మన దేశంలో ఉక్కు పరిశ్రమ వృద్ధి బాటలో కొన్ని అవరోధాలు ఎదురవుతున్నాయి. వీటిలో నియంత్రణపరమైన అవరోధాలు, పర్యావరణ సంబంధమైన అవరోధాలు, ప్రాజెక్టులకు అవసరమైన భూమి సేకరణలో జాప్యాలు, సమాజ పరంగా ఎదురవుతున్న వ్యతిరేకత వంటివి చెప్పుకోదగ్గవి. ఇన్ని ప్రతికూలతల మధ్య కూడా ఈ రంగంలోని కంపెనీలు వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశాలలో భారత్ ఒకటి కావడంతో ఉక్కుకు గిరాకీ క్రమంగా పెరగక తప్పదన్న ఆశలే ఇందుకు కారణం. 2012-13 ఆర్థిక సంవత్సరం ముగిసే సరికల్లా ముడి ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం సుమారు 110 మిలియన్ టన్నులకు చేరుకోగలదని అంచనా. ఉక్కుకు ప్రపంచవ్యాప్తంగా చూసినపుడు గిరాకీ సగటున 5-6 శాతం ఉంటే, భారత్‌లో 14% ఉండవచ్చని భావిస్తున్నారు. దేశీయంగా మౌలిక రంగ అవసరాలు, పారిశ్రామికోత్పత్తి వృద్ధి కోణాలలో పరిశీలిస్తే మౌలిక సదుపాయాలతో పాటు నిర్మాణాలు, గృహ నిర్మాణం, వాహనాలు, ఉక్కు గొట్టాలు, ప్యాకేజింగ్‌ల వంటి పలు పరిశ్రమలలోనూ ఉక్కుకు గిరాకీ హెచ్చనుంది. కొత్త విమానాశ్రయాలు, ఇప్పటికే ఉన్న విమానాశ్రయాల ఆధునికీకరణ, విద్యుత్తు ఉత్పాదన, ఎరువుల పరిశ్రమలు.. వీటన్నింటికీ ఉక్కు కావాలి.

పలు అవరోధాలు ఉన్నప్పటికీ అవి ఈ పరిశ్రమ ఎదుగుదలను ఆపలేకపోతున్నాయి. పలు కంపెనీలు విస్తరణ వ్యూహాలు సిద్ధం చేసుకున్నాయి. రానున్న రెండేళ్లలో ఈ రంగంలో విలీనాలు, కొనుగోళ్లు చోటు చేసుకొనే ఆస్కారం ఉంది. అనేక విదేశీ కంపెనీలు భారత్‌లో అడుగుపెట్టడానికి చొరవ తీసుకున్నాయి. టాటా స్టీల్- నిప్పన్ స్టీల్ సంయుక్త సంస్థ (జేవీ), జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌లో వాటా కొనుగోలు దిశగా జేఎఫ్ఈ హోల్డింగ్స్ చర్చలు, సెయిల్- కోబే స్టీల్ జేవీ చర్చలు, ఎన్ఎమ్‌డీసీ-సెవర్‌స్టల్ జేవీ.. ఇవన్నీ ఇందుకు ఉదాహరణలే.

## సాంకేతిక పరిజ్ఞానంలోనూ బహుశా మార్పులు!

సంప్రదాయ ఉక్కు కొలిములు ఇనుప ఖనిజం లంప్స్‌ను, కోకింగ్ కోల్‌ను మాత్రమే ఉపయోగించుకోగలవు. కానీ ఇప్పుడు ఐరన్ ఓర్ ఫైన్స్‌ను, నాన్-కోకింగ్ కోల్‌ను ఉపయోగించుకోగల సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవడంపై కంపెనీలు దృష్టి సారిస్తున్నాయి. ఈ విధమైన ముడిసరుకు దేశంలో సమృద్ధిగా లభిస్తుండడమే కంపెనీలు తమ ప్రాధాన్యాన్ని మార్చుకోవాలనుకుంటుండడానికి కారణం.

## ఉక్కు వినియోగం భారత్‌లో తక్కువే ఎందుకంటే

అభివృద్ధి చెందిన దేశాల్లో ఆకాశ హర్మ్యాలు, వంతెనలు, వాణిజ్య భవన సముదాయాలు, నివాస భవనాలు.. ఇలా ప్రతిదీ ఎక్కువగా ఉక్కును ఉపయోగించే నిర్మిస్తారు. అదే ఇక్కడ కాంక్రీటు వాడతారు. గ్రామాలలో ఉక్కు వినియోగం ఇప్పటికీ ఎంతో తక్కువగా ఉంది. ఉక్కు వినియోగంపై చైతన్యాన్ని పెంచడానికి ఇన్స్‌డాగ్ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టీల్ డెవలప్‌మెంట్ అండ్ గ్రోత్) తెర మీదికొచ్చింది.

## ఇన్స్‌డాగ్ పాత్ర

ఇది ఒక లాభాపేక్ష రహిత సంస్థ. కేంద్ర ఉక్కు శాఖ, ప్రధాన ఉక్కు కంపెనీలు కలసి దీనిని నెలకొల్పాయి. ఈ సంస్థ ఇతర పదార్థాలతో పోలిస్తే ఉక్కును వినియోగించడం వల్ల కలిగే లాభాలను గురించి, ఉత్తమ ఉపయోగ పద్ధతులను గురించి ప్రచారం చేస్తూ ఉంటుంది. పునశ్చరణ తరగతులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కార్మికుల నైపుణ్యాలకు మెరుగులు దిద్దుతూ ఉంటుంది. ఉక్కు వినియోగానికి అండగా నిలిచే అనుబంధ పరిశ్రమలు విస్తరించడానికి సహకరిస్తుంటుంది కూడా.



## మా నుంచి బహుళ అంతస్తుల భవనాలు కూడా

పారిశ్రామిక నిర్మాణాలు, గోదాములే కాకుండా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణంలో కూడా పెబ్స్ పెన్నార్ చురుగ్గా కృషి చేస్తోంది. షామీర్‌పేటలో ఒకటి, గచ్చిబౌలీలో మరొకటి ఇటువంటి భవనాలను నిర్మించింది. అంతే కాదు, 30 నుంచి 40 అంతస్తులతో రూపుదిద్దుకొనే కొన్ని ప్రాజెక్టులకు మేం బిడ్‌లు వేశాం. బాగా ఎత్తయిన భవనాల నిర్మాణంలో తోడ్పడే ఇంజినీరింగ్ డిజైన్ సాఫ్ట్‌వేర్‌ను సమకూర్చుకొనే పనిలో ఉన్నాం.